గజదొంగ

వసుంధర

"ఎలాగైనా సుందరి అదృష్టవంతురాలు—" అంటూ సంతోషంగా అన్నాడు పార్వతీశం.

"ఆ విషయం ఈనాడంటున్నారు మీరు. పుట్టినప్పుడే గ్రహించాను నేను—" అంది మాలతమ్మ.

పార్వతీశం, మాలతమ్మ భార్యాభర్తలు. ఇద్దరు మగపిల్లలు పెద్ద చదువులు చదువుకుని దూరప్రాంతాల మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. వారికద్దు ఉన్నదల్లా ఒక్కగానొక్క కూతురు. ఆమె పేరు సుందరి. సుందరి బియ్యే చదువుతున్నది.

సుందరి రెండో అన్నకంటె ఏడేళ్ళు చిన్నది. అందుకని ఆమె ఆ యింట్లో అల్లారుముద్దుగా పెరిగింది. అలాగని ఆమె రణపెంకి కాదు. పెంకితనం ఉన్నా అది ఆడపిల్లలకు అందాన్నిచ్చేటంత మాత్రమే ఉన్నది.

చూస్తూ చూస్తూ కూతుర్ని పెళ్ళిచేసి మరో యింటికి పంపేయలేక పార్వతీశం కాస్త జాప్యం చేశాడు. కానీ

తన కళ్ళముందే కూతురికంటే చిన్నవాళ్ళు పెళ్ళిళ్ళు అయిపోతూంటే ఆయనకు కాస్త బాధకలిగింది. ఏ వయసులో జరుగవలసిన ముచ్చట ఆ వయసులో జరగాలి. ఆడపిల్లన్నాక ఎలాగూ గడపదాటి వెళ్ళక తప్పదు. అటువంటప్పుడా మెకు వయసు ముదరనివ్వడమెందుకు?

అలాగని సుందరి వయసేమీ ముదరలేదు. పదహారో ఏట ప్రారంభం కావలసిన పెళ్ళిప్రయత్నాలు పద్దెనిమిదో ఏట ప్రారంభమయ్యాయి.

సుందరి అందంగా ఉంటుంది. చక్కటి అంగసౌష్ఠవం. తెలివితేటల కారణంగా ఆమె కళ్ళలో ప్రత్యేకమైన చురుకుదనం కనబడుతుంది.

పార్వతీశం వెతికి వెతికి మంచి సంబంధమేపట్టాడు.

వరుడిపేరు సత్తిబాబు. చూడ్డానికి అందంగా ఆకర్షణీయంగా ఉన్నాడు. నాగార్జున సాగర్‌లో జూనియర్ ఇంజనీరుగా ఉంటున్నాడు. మనిషి చలాకీగా ఉంటాడు. పెళ్ళిచూపులకు వచ్చినప్పుడతడు తెలుగు సినిమా హీరోల్లా బిగుసుకుపోకుండా హిందీ సినిమా హీరోల్లా ఫ్రీగా ఉన్నాడు.

పార్వతీశానికి వరుడు నచ్చాడు. వరుడికి పిల్ల నచ్చింది. అప్పటికప్పుడు పెళ్ళిమాటలు జరిగాయి.

మగపెళ్ళివారు పాతికవేల రూపాయలు కట్నం అడిగారు. పిల్ల మెడలో కనీసం అయిదు తులాల బంగారం ఉండాలన్నారు.

పార్వతీశం పేదవాడు కాదు. అలాగని కూతురికి పాతికవేల కట్నం ఇచ్చుకోలేడు. ఆయన తన కొడుకులకు నామమాత్రంగా కట్నం తీసుకున్నాడు. ఆ కట్నం డబ్బు ఆ పెళ్ళి ఖర్చులకే సరిపోయింది.

కూతురి పెళ్ళికి ఆయన పదివేలు కట్నమివ్వాలనుకున్నారు. అయిదు వేలు లాంఛనాలనుకున్నాడు. పదివేలు పెళ్ళిఖర్చులనుకున్నాడు. ఈ పాతికవేలూ ఎలాగో అలా సమకూర్చగలననుకున్నాడు. ఆయనవద్ద పదిహేను వేలు క్యాషు సిద్ధంగా ఉన్నది. కొడుకులిద్దరూ చెరో అయిదు వేలూ అప్పుగానైనా పుట్టించగలరని ఆయన నమ్మకం.

ఇప్పుడు పెళ్ళివారు కట్నమే పాతికవేలు అడుగుతున్నారు. అయిదు తులాల బంగారం గురించి బాధలేదు. అది పిల్ల మెడలో ఉండనే ఉన్నది. కానీ కట్నం పాతికవేలంటే పెళ్ళి ఖర్చులు కనీసం మరో పదిహేను వేలుంటాయి. అనగా అప్పు చేయవలసిన మొత్తం పాతిక వేలు అవుతుంది.

అయితే సుందరి ఆయనకు ఒక్కగా నొక్క కూతురు. ఈ సంబంధం చేస్తే కూతురు సుఖపడుతుందన్న నమ్మకమాయనకున్నది. అందువల్ల కొద్ది క్షణాలు మాత్రం ఆలోచించి పెళ్ళివారి షరతులకు అంగీకరించి పంపేశాడు పార్వతీశం.

పెళ్ళివారు వెళ్ళిపోయాక ఇంట్లో ఈ విషయమై చర్చలు ప్రారంభమయ్యాయి.

"ఎలా తెస్తారండీ అంత డబ్బు?" అంది మాలతమ్మ.

"ఎలాగో తెస్తాను. ఒక్కగా నొక్క కూతురు. చూస్తూ చూస్తూ పదిహేను వేలకోసం రాజాలాంటి సంబంధం వదులుకుంటానా?" అన్నాడు పార్వతీశం.

సుందరి తలిదండ్రులపైన అంతెత్తున విరుచుకుపడింది.

నాకేం అందం లేదా, చదువు లేదా, కట్నం పేరు చెప్పి నన్నిలా అవమానిస్తారా, ఈ సంబధానికి ఒప్పుకునేందుకు వీల్లేదు—అన్నదామె.

తండ్రి ఎంత చెప్పినా ఆమె శాంతపడలేదు. అందుకు కారణముంది.

తను చాలా గొప్పదాన్ననీ తనకోసం పురుషులు ఎటువంటి త్యాగం చెయ్యడానికైనా సిద్ధంగా ఉన్నారనీ సుందరికో అభిప్రాయం ఏర్పడి బలపడింది. అందుకు కారణం బయటప్రపంచంలో ఆమెవెంటబడే యువకులు, ఆమెకు వచ్చే ప్రేమలేఖలు. ఆమె క్రీగంటి చూపుల కోసం తహతహలాడే ఎందరో యువకులామెకు ఉత్తరాలూ రాశారు. కలుసుకుని మాట్లాడ్డానికి ప్రయత్నించారు.

సుందరి ఎవరినీ పట్టించుకోలేదు. తనవెంటబడేవారినీ, తనకు వచ్చే ప్రేమలేఖల్నీ — తన గొప్పతనానికి కొలబద్దలా చూసుకుంటోందామె.

"నిన్ను చూడగానే నేను పోగొట్టుకున్నదేదో దొరికినదనిపించింది. నీ కోసం ఏమైనా చేస్తాను. నీ పరిచయ భాగ్యం నాకు కలగనవ్వు—"

"నువ్వు అసమాన తేజోరాశివి. నీ ముఖంవంక చూసే శక్తి కూడా నాకు లేదు. నీ పాద స్పర్శ కలిగితేచాలు— ఈ జీవితానికింతకుమించిన అదృష్టం లేదనుకుంటాను-..."

"ఎందుకీ అర్థంలేని చదువులు? అందమైన ఈ ప్రపంచంలో ఆనందంగా విహరించవలసిన ఈ వయసును చదువుల పేరుతో వృధాచేస్తున్నామని నాకు అనిపించింది. నువ్వు ఊఁ అంటే మన పెళ్ళి జరుగుతుంది. ఆ తర్వాత మనం కాలేజీ వదిలిపెట్టి కాశ్మీరు వెళ్ళిపోదాం."

ఇలాంటి ఉత్తరాలు చాలా వచ్చాయి సుందరికి. వీటికామె రెస్పాన్సు ఇవ్వనూలేదు. వీటినామె తలిదండ్రులకు చూపనూ లేదు.

ఇప్పుడు ఓ సత్తిబాబు పాతికవేలు కట్నం ఇచ్చే

మాటైతేనే తనను పెళ్ళాడతానంటున్నాడు. లేని పక్షంలో తనను నిరాకరిస్తాడు.

సత్తిబాబుకు తన గొప్పతనం నిరూపించుకోవాలని సుందరికి అనిపించింది. అప్పుడామె తన వెంటబడే యువకుల గురించి ఆలోచించింది.

వారిలో చాలామంది విద్యార్థులు.

విద్యార్థులనామె ప్రేమించదల్చుకోలేదు. వాళ్ళూ చదువుకుంటున్నారు. తనూ చదువుకుంటోంది. వాళ్ళను ప్రేమించి తన జీవితంలో ఎలా స్థిరపడుతుంది?

ఆమెపట్ల ప్రేమను ప్రకటించినవారిలో ఇద్దరు కాలేజీ లెక్చరర్సు కూడా ఉన్నారు. వారిలో ఒకాయన బాగుండడు. రెండో ఆయన చాలామందికి ప్రేమలేఖలు రాసినట్లు తెలిసింది.

సత్తిబాబుమీద యేర్పడిన కసి తర్వాత సుందరి దృష్టిలోనికి వచ్చినవాడు చిన్నారావు.

చిన్నారావు కాలేజీ విద్యార్థి కాదు. ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం. అతడామెకు తమాషాగా తటస్థపడ్డాడు.

ఓ రోజు బస్‌స్టాపులో అతడు, ఆమె మాత్రం ఉన్నారు.

"ఏమండీ మీ పేరు సుందరికదూ—" అన్నాడతడు.

"మీకెలా తెలుసు?" అన్నదామె ఆశ్చర్యంగా.

"మీ పుస్తకాలమీద చూశాను—" అన్నాడతడు.

సుందరి పలకరింపుగా నవ్వి ఊరుకుంది.

"నా పేరు చిన్నారావు. నేనుద్యోగం చేస్తున్నాను. నెలకు ఏడువందలయాభై రూపాయలు వస్తుంది. ఇంకో ఏడాదిలో ప్రమోషన్ కూడా వస్తుంది. అప్పుడు నెలకు

వెయ్యి రూపాయలు జీతం అవుతుంది—"

సుందరికేం చెప్పాలో అర్థంకాలేదు.

"మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నానండీ — నాకు మీ రెంతో నచ్చారు. మీకూ నేను నచ్చినమాటైతే మీ యింటికి వెళ్ళి మీ నాన్నగారిని కలుసుకుంటాను—" అన్నాడతడు.

అతడంత సూటిగా మాట్లాడ్డం సుందరికి ఆశ్చర్యాన్నీ, ఇబ్బందినీ కలిగించింది. ఏమనాలా అనుకుంటూండగా బస్సు వచ్చింది.

ఆ తర్వాత చిన్నారావామె వెంట చాలా సార్లు పడ్డాడు. తన ప్రేమగోడు వెళ్ళబుచ్చుకున్నాడు.

అతడు పొగుడుతూంటే ఆమెకు ఎంతో బాగుండేది. కానీ అతడలా వెంటబడడం ఆమెకు నచ్చలేదు. మొదటిదామె అతడికి చెప్పలేదు. రెండోది చెప్పింది.

"నేను మీ వెంటపడడం మానలేను. మీరు అవున నేనా అనండి. కాదనేనా అనండి. అప్పుడు వెళ్ళిపోతాను—" అన్నాడు చిన్నారావు.

"కాదు—" అనేసింది నిర్దాక్షిణ్యంగా సుందరి.

"వెంటబడ్డ మగాడిని ఆడది కాదు అని చెప్పే పద్ధతి అది కాదు—" అన్నాడు చిన్నారావు.

"మరేమిటి?" అడిగిందామె.

"చెంపదెబ్బ లేదా చెప్పుదెబ్బ!" అన్నాడతడు.

సుందరి నివ్వెరపోయింది. అతడు మరీ ఇలా అంటాడని ఆమె అనుకోలేదు. అలాంటివాడికి చెంపదెబ్బ లేదా చెప్పు దెబ్బయే సరైన సమాధానం.

కానీ ఎలా?

సుందరి సంస్కారం అందుకు సహకరించలేదు.

"ఇలాగనడానికి మీకు సిగ్గులేదూ?" అన్నదామె.

"ప్రేమ అహాన్ని చంపేస్తుంది. అహం పోయాక ఇంక సిగ్గేమిటి?" అన్నాడు చిన్నారావు.

సుందరికి ఏంచేయాలో తెలియలేదు.

"చూశారా — మీకు తెలీకుండానే మీరు నన్ను ప్రేమిస్తున్నారు. అందుకే నన్ను కొట్టలేకపోతున్నారు" అన్నాడు చిన్నారావు సంతోషంగా.

"కొట్టలేకపోవడం నా సంస్కారం. వెంటబడకుండా ఉండడం మీ సంస్కారాన్ని నిలబెడుతుంది-" అంది సుందరి.

"మీకింకా వివాహంకాలేదు. అంతవరకూ వెంటబడే హక్కు నాకుంది. ఆ తర్వాత వెంటబడితేనే మీరు నా సంస్కారాన్ని గురించి మాట్లాడాలి—" అన్నాడు చిన్నారావు.

సుందరికి ఏమనాలో తెలియలేదు. పెళ్ళికాని ఆడపిల్ల వెంటబడడం ప్రతి యువకుడి హక్కు అంటున్నాడు చిన్నారావు. ఆ హక్కు గురించి తనకు తెలియదని చెప్పి ఊరుకున్నదామె.

చిన్నారావామెను ఇంచు మించు ప్రతి రోజూ చూస్తూనే ఉండేవాడు. ఒంటంగా దొరికితే మాట్లాడేవాడు. లేని పక్షంలో ఊరుకునేవాడు. అతడి ప్రవర్తనలో సంస్కారం కనబడేది. మాట్లాడినపుడల్లా అతనామెను పొగిడేవాడు. ఆ పొగడ్తల్లోనూ సంస్కారముండేది.

సత్తిబాబు పాతికవేలు కట్నం అడగ్గానే కలిగిన ఆవేశంలో సుందరి చిన్నారావును ప్రేమించాలని అనుకుంది. ఆమె అతడికి తెలియకుండానే కొంత పరిశోధన చేసి తన గురించి అతడు చెప్పుకున్నవన్నీ నిజమేనని

గ్రహించింది. అతడా ఊళ్ళో ఒంటరిగా ఉంటున్నాడు. అతడి ఉద్యోగం ప్రయివేటు కంపెనీలోనే అయినప్పటికీ దానికి రక్షణ ఉన్నది.

తానిక చిన్నారావుని ప్రేమించడంలో తప్పుగానీ, నష్టంగానీ లేదని ఆమె నిర్ణయించుకుంది.

ఒకరోజున అతడితో — "ఎందుకిలా మీరు రోజూ నా వెంటబడతారు?" అనడిగింది.

"మీరంటే నాకిష్టం—" అన్నాడతడు.

"ఇష్టమైతే వెంటబడతారా?"

"ప్రస్తుతానికి అంతకుమించి ఏం చేయాలో నాకు తెలియడంలేదు—"

"ఇప్పుడలాగే అంటారు. వెంటబడతారు. తీరా వ్యవహారం పెళ్ళిదాకా వస్తే అప్పుడు కట్నాలు, లాంఛనాలు అంటారు—...."

చిన్నారావు నవ్వి—"మీరు నన్ను ప్రేమిస్తున్నానని ఒక్క ముక్క చెప్పండి. చాలు. ఆ తర్వాత మన పెళ్ళి అయ్యేవరకూ నేను మీ వెంటబడను—" అన్నాడు.

"ఏం చేస్తారు?" అన్నదామె.

"మీ నాన్నగారిని కలుసుకుంటాను. మన ప్రేమ గురించి చెబుతాను—"

"మా నాన్నగారిని కలుసుకోండి. మన ప్రేమ గురించి మాత్రం చెప్పకండి. మీ ప్రేమ గురించే చెప్పండి—"

"అంటే?"

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఆ కానీ సంగతి మీరు మా నాన్నగారికి చెప్పకూడదు—" అంది సుందరి.

చిన్నారావుకు కలిగిన ఆనందమింతా అంతా కాదు. అతడా రోజునే పార్వతీశాన్ని కలుసుకున్నాడు. తన్ను

తాను పరిచయం చేసుకున్నాడు.

"ఇంతకూ నువ్వొచ్చిన పనేమిటి?" అన్నాడు పార్వతీశం.

"కాలేజీకి వెడుతూండగా చాలాసార్లు మీ అమ్మాయిని నేను చూశాను. ఆమె అంటే ప్రేమ కలిగింది. నన్ను, నా భార్యను పోషించుకోడానికి ఉద్యోగముంది నాకు. నా పెద్దలు నా ఇష్టాన్ని కాదనరు. నాకు పైసా కట్నం అక్కర్లేదు. సింపుల్ గా రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి జరిపిస్తే చాలు—" అన్నాడు చిన్నారావు.

"అమ్మాయి నువ్వంటే ఇష్టపడిందా?" అన్నాడు పార్వతీశం తాపీగా.

"ఏమో—నాకా విషయం తెలియదు. వయసులో ఉన్న ఆడపిల్లను పలకరించి ఇలాంటి ప్రశ్నలువేయడం భావ్యం కాదనిపించింది. ఆమెను నేనెన్నడూ పలకరించలేదు. ఆమెతో మాట్లాడలేదు...." అన్నాడు చిన్నారావు.

పార్వతీశం అప్పుడతడి కులం, గోత్రం అడిగాడు.

అతడు చెప్పిన వివరాలన్నీ విని — "నువ్వు చాలా మర్యాదస్థుడిలాగున్నావు. అందుకే నీకు నేను మర్యాదగా చెబుతున్నాను. నువ్వు పెళ్ళికి వేరే పిల్లను చూసుకో. కట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటానంటే చాలామంది నీ కోసం ఎగబడతారు. నీ దురదృష్టంకొద్దీ నేనలాంటివాణ్ని కాదు—" అన్నాడు పార్వతీశం.

"నాలో ఏం లోపం కనిపించింది మీకు?" అన్నాడు చిన్నారావు.

"నీలో లోపమేం లేదు. మాది సంప్రదాయం గల కుటుంబం. ఉన్నది ఒక్కగానొక్క ఆడపిల్ల. కట్న

మిత్యాగల స్తోమత ఉన్నది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని వదులుకుని వర్ణాంతర సంబంధం చేయడం నాకిష్టంలేదు—...."

"ఈ రోజుల్లో కూడా మీరలాగంటే ఎలా?" అన్నాడు చిన్నారావు.

"రోజులు పెద్దగా మారాయని నేననుకోను. నేనెరిగి నా బంధువుల్లో యెవ్వరూ వర్ణాంతర వివాహం జరిపించలేదు—" అన్నాడు పార్వతీశం.

"కానీ మీరు అమ్మాయి సుఖం కూడా ఆలోచించుకోవాలి. అన్నివిధాలా నా సంబంధం మంచిది—ఒక్క కులం సంగతి మర్చిపోతే!" అన్నాడు చిన్నారావు.

పార్వతీశం లోపలకు వెళ్ళి ఓ ఫోటో తెచ్చాడు. అది సత్తిబాబుది!

"ఇది చూడు. ఇందులోని మనిషి నీ కంటే గొప్పగా ఉన్నాడు. పైగా ఇతడు ఇంజనీరు. నేనీ సంబంధాన్ని అమ్మాయికి సిఫారసు చేశాను. ఇక్కడ అన్నీ కలిశాయి—"

"అన్నీ కలిసినా మనసు సంగతి ఆలోచించాలి మీరు. నాకూ కట్నమిస్తామంటూ సంబంధాలొస్తున్నాయి. కానీ నేను మీ అమ్మాయిని ప్రేమించాను. అందుకే కట్నం కూడా వద్దంటున్నాను...."

"నువ్వు కట్నం వద్దంటున్నావు. నేను నువ్వే వద్దంటున్నాను...."

"నా ప్రేమ బలమైనది. మిమ్మల్ని ఒప్పించేదాకా నేనిక్కణ్ణించి కదలను—"

"చూడు మిస్టర్ చిన్నారావ్! నువ్వు మర్యాదస్థుడివి కదా అని నేనూ మర్యాదనిచ్చి మాట్లాడాను. నీ మర్యాద నువ్వు నిలబెట్టుకో. నీ సంబంధం మాకు వద్దు.

నువ్వింక వెళ్ళవచ్చు—" అన్నాడు పార్వతీశం.

చిన్నారావు వెళ్ళిపోయాడు.

ఈ సంభాషణంతా సుందరి వింటోంది. తండ్రి మూర్ఖత్వం ఆమెకు చాలా చిరాకును, విచారాన్ని కలిగించింది.

"ఎవరండీ అతడు?" అంది మాలతమ్మ.

చిన్నారావు గురించి చెప్పాడు పార్వతీశం—"అడ్డమైనవాళ్ళకూ నా కూతుర్నిచ్చి పెళ్ళిచేయడానికి నేనేమైనా గతిలేనివాడిననుకున్నాదేమో—తల తాకట్టు పెట్టయినా అమ్మాయికా ఇంజనీరు సంబంధం చేస్తాను తప్పితే ఇలాటి చచ్చు సంబంధాల జోలికి వెళ్ళను—"

ఆ రోజు సుందరి ఇంట్లో కాస్త గొడవచేసింది. అది తన పెళ్ళికి సంబంధించిన విషయమన్న సిగ్గును కూడా ఆమె విడిచిపెట్టింది.

చిన్నారావు సంబంధానికి ఒప్పుకుంటే తండ్రికి నలభై వేలు ఆదా అవుతుంది. కులం, మతం అన్నవి మనిషి ముఖంమీద రాసి వుండవు. అవి మనిషి ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన అర్థరహిత భావాలు. మనుషులంతా ఒక్కటేనన్న భావం ఇంకా ఇప్పటికీ ఈ దేశంలో కలగని కారణంగానే — ఇక్కడి ప్రజలిలా అవస్థపడుతున్నారు. పాతిక వేలు కట్నంతో పెళ్ళిని ముడిపెట్టి సుందరిని అవమానించాడు సత్తిబాబు. చిన్నారావా అవమానాన్ని తొలగించాడు. అన్నివిధాలా చిన్నారావు ఉన్నతుడు.

తండ్రి ఆమె ఆలోచనలన్నిటినీ కొట్టిపారేశాడు. సంప్రదాయానికి మించింది లేదన్నాడు. కులం తేడా రావడంవల్ల వీళ్ళిద్దరూ ఎలావున్నా—వీళ్ళకు పుట్టబోయే

సంతానం చాలా ఇబ్బందిపడాలన్నాడు. తన అనుభవం ముందు సుందరి అనుభవం చాలదన్నాడు.

"సత్రిబాబు నన్ను పాతికవేలతో కలిపి ప్రేమిస్తున్నాడు. చిన్నారావు నన్ను నన్నుగా ప్రేమిస్తున్నాడు—" అంది సుందరి.

"నిన్ను నిన్నుగా అతడేం ప్రేమించడంలేదు. ఇదే అందంతో నువ్వే వేశ్య యింటనో పుట్టివుంటే అతడు నీ గురించి పెళ్ళి అన్న ఆలోచన కూడా రానిచ్చేవాడు కాదు. అతడు నీ వెనుకనున్న కుటుంబ సంప్రదాయాన్నీ, నీ సంస్కారాన్నీ నీతో కలిపి చూస్తున్నాడు. ప్రేమ అన్నది ఓ క్షణంలో పుట్టేది కాదు. అలా జరిగినా ఓ చూపులో పుట్టిన ప్రేమ ఓ మాటతో పోతుంది. ఎన్నో రోజుల అనుబంధంతో కలిగిన ప్రేమ శాశ్వతమైనది. ఆ ప్రేమ ఎన్ని తప్పులనైనా క్షమించగలుగుతుంది—" అన్నాడు పార్వతీశం.

ఆయన్ను సమర్థిస్తూ మాలతమ్మ కూతుర్ని తిట్టింది. అప్పుడు పార్వతీశం—"దానినేమీ అనకే! దాని పెళ్ళికి మనమేదో కష్టపడిపోతున్నామని దాని బాధ. అది సుఖంగా వుండాలి కానీ నలభై వేలో పెద్ద లెక్క కాదు నాకు. అవసరమైతే నాలుగు లక్షలైనా తెచ్చి దానికి మంచి సంబంధం తేగలను. తలిదండ్రుల ప్రేమను అది అర్థం చేసుకోలేకపోతోంది. అంతే!" అన్నాడు.

తలిదండ్రుల ప్రేమను సుందరి అర్థం చేసుకుంది. కానీ తన ప్రేమను వారు అర్థం చేసుకోవడంలేదన్నది ఆమె బాధ. ప్రేమతో వారు తన కోసం త్యాగం చేయాలనుకుంటున్నారు. కానీ వారి ప్రేమను తను అంగీకరిస్తే అది స్వార్థం అవుతుంది. అదామెకు ఇష్టంలేదు.

తలిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె చిన్నా రావును పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకుంది.

మర్నాడు చిన్నారావామెను కలిశాడు.

"మీ మాట విని మీ నాన్నగారిని కలుసుకుంటే నాకు అవమానం ఎదురయింది. మీకు ముందే సంబంధం నిశ్చయమయిందని ఎందుకు చెప్పలేదు?" అన్నాడతడు కోపంగా.

"మీరు నన్ను ప్రేమిస్తున్నానని చెప్పారు. కానీ ఒక చిన్న సంఘటనతో అప్పుడే మీకు నామీద కోపం వచ్చేసింది. ఇంతేనా మీ ప్రేమ?" అంది సుందరి.

చిన్నారావు తడబడి — "మీరు నాతో ఆడుకుం టున్నారేమోనని అనుమానం వచ్చింది. అసలు నాకలా అనుమానం రావడం పెద్ద తప్పు. అందుకు మిమ్మల్ని మన్నించమని అడుగుతున్నాను...." అన్నాడు.

అతడి సంస్కారం ఆమెను ముగ్ధురాల్ని చేసింది. అప్పుడామె సత్తిబాబు సంబంధం గురించి చెప్పి— "నాన్నగారు తనాడబ్బును పోగుచేయగలననే అనుకుం టున్నారు. నాకది ఇష్టంలేదు. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను—తలిదండ్రుల్ని యెదిరించి అయినా సరే...." అంది.

చిన్నారావు చాలా సంతోషించాడు.

"తన ప్రయత్నాలు సఫలంకావని నాన్నగారు గుర్తించే రోజొస్తుంది. అంతవరకూ మన ప్రేమ వ్యవహారం రహస్యంగా వుంచుదాం. ముందు దెబ్బలాడినా తర్వాత నన్నెవ్వరూ ఏమీ అనరు. మా ఇంట్లో నా మాట కాదనేవారు లేరు—" అంది సుందరి.

ఆ రోజునుంచీ వాళ్ళిద్దరూ రహస్యంగా కలుసుకుం

టూండేవారు. క్రమంగా వారి మధ్య ప్రేమ ద్విగుణీకృత మయింది. ముఖ్యంగా సుందరికి చిన్నారావుపట్ల ఆకర్షణ మరీమరీ పెరగసాగింది.

ఇద్దరూ ఒకరులేనిదే ఒకరు బ్రతకలేమని నిర్ణయానికి కూడా వచ్చారు.

అప్పుడు అనుకోనిది జరిగిపోయింది.

పార్వతీశం పెదనాన్న ఒకడు పోయాడు. ఆయన పేరున చాలా ఇన్సూరెన్సులున్నాయి. అందులో ఒక దానికి పార్వతీశం నామినీ. ఆ విధంగా ఆయనకు అనుకోకుండా పదిహేనువేలు వచ్చాయి.

పార్వతీశం తండ్రి చాలామందికి నోట్లమీద అప్పులిచ్చారు. దురదృష్టవశాత్తూ అవన్నీ కోర్టు లావాదేవీల్లో ఇరుక్కున్నాయి. ఉన్నట్లుండి ఆ సమస్య పువ్వులా విడిపోయింది. వాటిమీద వచ్చిన డబ్బును ముగ్గురన్నదమ్ములు సమంగా పంచుకున్నారు. ఆ విధంగా పార్వతీశానికి మరో ఇరవై వేలు వచ్చాయి.

ఈ విధంగా డబ్బు సమస్య పువ్వులా విడిపోయింది.

"ఎలాగైనా సుందరి అదృష్టవంతురాలు—" అంటూ సంతోషంగా అన్నాడు పార్వతీశం.

"ఆ విషయం ఈనాడంటున్నారు మీరు. పుట్టినప్పుడే గ్రహించాను నేను—" అంది మాలతమ్మ.

2

"ఇదీ పరిస్థితి. ఇప్పుడు మనమేం చేయాలి?" అంది సుందరి.

చిన్నారావు ఆలోచనలోపడ్డాడు — "రేపే వెళ్ళి పెళ్ళిచేసుకుందాం. ఆ తర్వాత యెవరూ మనల్నేమీ చెయ్యలేరు...."

సుందరి కాస్త భయపడింది. కానీ అదే చేయాలని ఆమె అనుకుంటోంది. అంత డబ్బు చూస్తూ చూస్తూ సత్తిబాబు పాలబడడం ఆమెకిష్టంలేదు. ఆ డబ్బంతా తండ్రికే మిగలాలి.

అయితే ఆ డబ్బుమీద ఏ మాత్రమూ మోజు చూపకుండా అంతా తనకోసమే ఖర్చుచేయాలనుకుంటున్న తండ్రి ఈ అఘాతాన్ని భరించగలడా? ఆ డబ్బు మిగలడం ఆయనకు సంతోషాన్ని కలిగించగలదా?

"రేపే పెళ్ళిచేసుకుందాం. ఆ తర్వాత యెవరూ మనల్నేమీ చెయ్యలేరు...." అని చిన్నారావు ప్రోత్సహిస్తున్నాడు.

ఒకప్పుడు తండ్రికి అంత డబ్బు పోగుచేయడం సాధ్యపడుతుందా అని తను భయపడింది. అందుకే చిన్నారావుని ప్రేమించి తండ్రికి సాయపడాలనుకుంది. తండ్రికి సాయపడాలనే ఆమె చిన్నారావును ప్రేమించింది.

కానీ ఇప్పుడు తండ్రికి డబ్బు అవలీలగా సమకూరింది. అదంతా సుందరి అదృష్టమని ఆయనంటున్నాడు. అదే నిజమేమో-ఆ అదృష్టాన్ని తను కాలరాసుకుంటోందేమో!

చిన్నారావును పెళ్ళిచేసుకుంటే తండ్రి షాక్ తింటాడు. ఇప్పుడు చిన్నారావును పెళ్ళిచేసుకోవాలనుకుంటే అదాయనకు సాయపడడం అనిపించుకోదు. ఆయనమీద దెబ్బతీసినట్లు అనిపిస్తుంది.

ఏం చేయడం?

ఇంత సమస్య యెందుకు వచ్చిందంటే ఇప్పుడామె చిన్నారావును ప్రేమిస్తోంది. అతడు లేనిదే జీవితం లేదనుకుంటోంది.

కానీ డబ్బులేనప్పుడే చిన్నారావును నిరసించిన పార్వతీశం—ఇప్పుడీ పెళ్ళికి ఒప్పుకుంటాడా?

ఒప్పుకోడని ఆమెకు తెలుసు.

చిన్నారావును వదులుకోలేదు. తండ్రికి బాధ కలిగించ రాదు.

ఎలా?

చిన్నారావుతో—"రేపే అనకు. ఇంట్లో మనకు అను కూల వాతావరణం సృష్టించగలనన్న నమ్మకం నాకు వుంది. ఒక్క వారం రోజులు ఆగు...." అన్నదామె.

3

ఆ రాత్రి మాలతమ్మ పిండివంటలు చేసింది. ఇంట్లో పెద్దపండుగలా వుంది.

"అసలీరోజే ఉత్తరం వ్రాయాలని ఉంది నాకు. కానీ రోజు మంచిది కాదు. మనం రాసిన వేళా-వాళ్ళందుకున్న వేళా కూడా మంచిది కావాలి. అందుకే ఉత్తరం రాయను. మంచిరోజు చూసి నేను బయల్దేరి వెడతాను. మంచి ఘడియల్లోనే వాళ్ళను కలుసుకుంటాను. తాంబూ లాలకు ఆహ్వానిస్తాను. దాంతో పాటే కట్నం ఇచ్చేస్తాను—" అన్నాడు పార్వతీశం ఉత్సాహంగా.

మరోసారి మాలతమ్మ కూతురి అదృష్టాన్ని పొగిడింది.

సుందరికీ మాటలు సుతరామూ నచ్చలేదు. ఆమెకు ఉత్సాహంగా కూడా లేదు. తల్లిదండ్రులు దేనికి వ్యతి రేకంగా ఆలోచిస్తున్నారో అదే తను చేయాలనుకుం టోంది. అందువల్ల పర్యవసానమేమిటి?

ఈ యింట్లో ఆనందాన్ని తను తుడిచిపెట్టివేస్తుందా?

సుందరికి మనఃస్థిమితంగా లేదు. ఆ రాత్రి ఓ పట్టాన ఆమెకు నిద్రపట్టలేదు. పట్టక పట్టక అర్ధరాత్రి వేళ నిద్ర

పడితే యెవరో లేపారు. ఓ పట్టాన అప్పుడామెకు మెలకువరాలేదు. విసుక్కుంది. గారాం చేసింది. గింజు కుంది. ఆఖరికామెకు లేవక తప్పలేదు. లేచి కనులువిప్పి తెల్లబోయింది.

తన్ను నిద్రలేపింది తలిదండ్రులుకాదు, ఒక అపరి చితుడు.

ఎత్తుగా, బలంగా వున్నాడు. బుగ్గమీసాలు.

"నేనెవరో తెలుసా?" అన్నాడతడు.

కంఠంలో ఆకారాని కుండవలసిన గాంభీర్యం లేదు.

సుందరి తల అడ్డంగా ఊపింది.

"పోనీ గజేంద్రసింగ్ పేరు విన్నావా?"

ఉలిక్కిపడింది సుందరి. ఆ పేరునామె విని ఉన్నది. గజేంద్రసింగ్ పేరు తెలుగుదేశంలో రెండేళ్ళుగా మార్మోగిపోతున్నది.

పేరుమోసిన గజదొంగ అతడు. చాలా తెలివిగా పథకాలువేసి వేలకు వేలు, లక్షలకు లక్షలు కాజేనూం టాడతడు. అతదేయింట అడుగుపెడితే ఆ యింట లక్ష్మి నిలవదు. అతడు పరమ కిరాతకుడనీ ఎలాంటి ఘోర కృత్యానికైనా వెనుదీయడనీ అంతా చెప్పుకుంటారు.

సుందరి భయంగా అతడివంక చూసింది. అప్పుడతడు ఆమె కంటికి రాక్షసుడిలా కనిపించాడు.

"నాతోరా!" అన్నాడు గజేంద్రసింగ్.

"ఎక్కడికి?" అంది సుందరి భయంగా.

"చెబుతాను. నాతోరా-" అన్నాడు గజేంద్రసింగ్.

సుందరి ఆలోచిస్తోంది. ఎవడీ గజేంద్రసింగ్. ఎందు కిక్కడికి వచ్చాడు? ఎలా వచ్చాడు?

ఆమె ఆలోచిస్తూనే అతడి ననుసరించింది.

ఇద్దరూ ఓ గదిలోకి వెళ్ళారు. అందులో రెండు కుర్చీల్లో పార్వతీశం, మాలతమ్మ బంధింపబడి ఉన్నారు.

"ఇదిగో—మీ కూతుర్ని కూడా తీసుకుని వచ్చాను" అన్నాడు గజేంద్రసింగ్ ఆమె తలిదండ్రులతో.

"ఎందుకు?" అన్నాడు పార్వతీశం.

"మీ యింట్లో నాకు పెద్దగా డబ్బేమీ దొరకలేదు. అయినా డబ్బు దొరుకుతుందని రాలేదు నేను. బ్యాంకులో ఎంత మొత్తం ఉందో నాకు తెలుసు. ఇటీవల నీకు అయాచితంగా ముప్పైఅయిదువేలరూపాయలు వచ్చాయి. నీ దగ్గర వేరే పదిహేనువేల రూపాయలున్నాయి. అనగా మొత్తం యాభై వేలు. ఆ డబ్బు నాక్కావాలి. ఇప్పటికిప్పుడు బ్యాంకులో డబ్బు ఎలా ఇవ్వగలవు? అందుకని నేను నీకు రేపటిదాకా టైమిస్తున్నాను. నువ్వు నాకు డబ్బిచ్చేదాకా హామీగా నాతో నీ కూతుర్ని తీసుకుని వెడుతున్నాను—" అన్నాడు గజేంద్రసింగ్.

"పెళ్ళికావలసిన పిల్ల. దాన్ని నీతో తీసుకువెళ్ళకు" దీనంగా అర్థించాడు పార్వతీశం.

"పెళ్ళికావలసిన పిల్ల కాబట్టే ఈమెను తీసుకు వెళ్ళడం—" అన్నాడు గజేంద్రసింగ్ నవ్వుతూ.

"నీకీ డబ్బు ఇస్తే దాని పెళ్ళి ఆగిపోతుంది—" అంది మాలతమ్మ.

గజేంద్రసింగ్ నవ్వాడు—"ఇలాంటి కబుర్లకు నేను లొంగను. నాక్కావలసింది డబ్బు. పెళ్ళి పేరుతో ఓ యువకుడా డబ్బును దోచుకునిపోతే మీకది అభ్యంతరం లేదు. కానీ నేను తీసుకుంటే దాన్ని దోపిడీ అంటారు. అనుకోండి. కానీ ఒక్కమాట. ఈ గజేంద్రసింగ్ చేయి మంచిది. ఎలాగూ ఈ డబ్బును పిల్ల పెళ్ళికి వాడాలను

కున్నారు. ఈ డబ్బు అక్కర్లేకుండా నే పిల్ల పెళ్ళి జరిగి పోతుంది. ఈ రోజు నేనన్నాను. ఆ మాట తప్పక జరుగుతుంది. అప్పుడీ డబ్బు ఒక పెళ్ళి ఆర్భాటానికీ, ఒక కుటుంబపు విలాసాలకీ కాక ఎందరో అభాగ్యుల జీవితాలు నిలబెట్టడానికి ఉపయోగపడుతుంది—"

గజేంద్రసింగ్ తన ఆశయ సాధన గురించి ఉపన్యాసమిచ్చాడు.

దేశంలో ఎందరో దరిద్ర నారాయణులున్నారు. వారి దుస్థితిని కళ్ళారా చూస్తూ కూడా పట్టించుకోనివారు ఎందరో ఉన్నారు. అలాంటివారిని అదుకోనడం కోసం గజేంద్రసింగ్ పూనుకున్నాడు. అతడికి నా అన్నవారెవ్వరూ లేరు. అనుచరులెవ్వరూ లేరు. ఒక్కడంటే ఒక్కడు.

"మీ దగ్గర నేను తీసుకుంటున్న ఈ డబ్బు సత్కార్యాచరణకు చందా అన్నమాట! మీ డబ్బు నా వద్దకు చేరగానే ఎందరో అభాగ్యుల ఆశీర్వాదాలు మీకు లభిస్తాయి. మేలు జరుగుతుంది—"

"యాభై వేల రూపాయలు చందా—" అంది మాలతమ్మ.

"మా కొంప కుండ మెపోతుంది. అయిదు వేలుతీసుకుని మమ్మల్ని వదిలిపెట్టు—" అన్నాడు పార్వతీశం.

"నావద్ద చేరాలుండవు...." అన్నాడు గజేంద్రసింగ్ "రేపు నువ్వు బ్యాంకుకు వెళ్ళి మొత్తం డబ్బు విత్ డ్రా చేసి చంచలా థియేటర్లో నాకు సాయంత్రం ఏడింటికి శాల్కానీ క్లాసులో అందచేస్తే — నువ్వింటికి వెళ్ళేసరికి నీ కూతురుంటుంది. నువ్వు పిచ్చి పిచ్చిగా ప్రవర్తించినా పోలీసులకు తెలియబర్చినా—నీ కూతురు ప్రాణాలతో

నిన్ను చేరదు—"

కాసేపు పార్వతీశం గజేంద్రసింగ్‌ను వేడుకున్నాడు. ఏమీ ప్రయోజనంలేదు.

సుందరి ఈ చోద్యమంతా చూస్తోంది. ఆమెకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. బుర్ర బొత్తిగా పని చేయడంలేదు. ఈలోగా గజేంద్రసింగ్ ఆమెను సమీపించి ఏదో రుమాలు నామె ముక్కు వద్ద బలంగా అదిమాడు. సుందరికి క్షణాలమీద స్పృహ తప్పింది. ఆమె కప్పలా నేలకూలింది. తర్వాత అతడు అదేపద్ధతిలో పార్వతీశానికీ, మాలతమ్మకూ స్పృహ తప్పించి వాళ్ళ కట్లు విప్పి—ఇద్దర్నీ మంచంమీదకు చేర్చాడు. తర్వాత సుందరిని ఎత్తుకుని బయటకు వెళ్ళిపోయాడు.

4

మర్నాడుదయం మెలకువ వచ్చినాక పార్వతీశం, మాలతమ్మ రాత్రి జరిగినదంతా నెమ్మదిగా గుర్తుచేసుకున్నారు.

"ఇప్పుడేం చేయాలి? యాభై వేల రూపాయలంటే మాటలు కాదు. ఎలా వదులుకుంటాం?" అన్నాడు పార్వతీశం.

పోలీసులకు ఫిర్యాదివ్వడం గురించీ, డిటెక్టివులను నియమించడం గురించీ ఇద్దరూ కాసేపు చర్చించారు. అందువల్ల ప్రయోజనముంటుందని ఇద్దరికీ తోచలేదు.

"పేరుమోసిన డిటెక్టివులే ఇంతవరకూ అతడి ఆరా తీయలేకపోయారు. మనకంటే గొప్పవాళ్ళే అతడి దోపిడీని అరికట్టలేకపోయారు. మనవల్ల ఏమవుతుంది? చెప్పిన ప్రకారం ఆ డబ్బివ్వలేకపోతే ఆ మ్మాయి ప్రాణాలకే ముప్పు కలగొచ్చు—" అని ఇద్దరికి అనిపిం

చింది.

చివరకి పార్వతీశం చంచలా థియేటర్లో అన్న టైముకి గజేంద్రసింగ్ కి యాభై వేలూ అందచేశాడు. గజేంద్ర సింగ్ దర్జాగా డబ్బందుకుని — "ఓ పావుగంట ఆగి ఇంటికి వెళ్ళు, నీకు శుభమవుతుంది—" అన్నాడు.

పార్వతీశం అలాగే చేశాడు. ఇంటికి వెళ్ళేసరికి గుమ్మంలోనే సుందరి కనబడింది. ముందాయనకు కలిగిన సంతోషమంతా అంతా కాదు. సుందరి ఆయనకు ముఖం చూపించి వెంటనే లోపలకు వెళ్ళిపోయింది.

పార్వతీశం లోపలకు వెళ్ళాడు. భార్య చాలా దిగులుగా ఉంది. ఆమె ముఖం చూడగానే ఆయనకూ యాభై వేల సంగతి గుర్తుకొచ్చి ముఖం దిగులుగా అయిపోయింది.

"ఒకటికాదు, రెండుకాదు-యాభై వేలు! ఎవరికైనా బాధగానే ఉంటుంది. ఏం చేస్తాం? పిల్ల ప్రాణాలు నిలబడ్డాయి. అందుకే మనం సంతోషించాలి...." అన్నాడు పార్వతీశం నిస్పృహగా.

"అదికాదండీ—" అంది మాలతమ్మ.

సుందరి డబ్బుకంటే విలువైనదాన్నే పోగొట్టుకుంది. గజేంద్రసింగ్ ఆమె శీలం దోచాడు.

"ఏమిటన్నావ్?" పార్వతీశం నిలువునా కూలబడిపోయాడు.

భార్యాభర్తలిద్దరూ కాసేపు మాట్లాడుకోలేదు. ఇద్దరికీ మతిపోయినట్లు అనిపించింది.

"ఇప్పుడేమిటి చెయ్యడం?" అంది మాలతమ్మ కాసేపటికి తేరుకుని.

"వెధవ..డబ్బుకి డబ్బూ కాజేశాడు...." అన్నాడు

పార్వతీశం పళ్ళు పటపటలాడిస్తూ.

"అంతా మన దురదృష్టం. జరిగిందానికిప్పు డెవర్నే మనుకుని ఏం ప్రయోజనం? ముందేం చేయాలన్నది ఆలోచించాలి—" అంది మాలతమ్మ.

అవును. ఇప్పుడేం చేయాలి?

సుందరికి అర్జంటుగా పెళ్ళిచేయాలి. లేకపోతే ఏ ప్రమాదమైనా జరగవచ్చు.

సుందరికి అర్జంటుగా పెళ్ళిచేయాలంటే డబ్బు కావాలి. ఉన్నట్లుండి తను బికారి అయిపోయాడు. కూతురి పెళ్ళి ఎలా చేయగలడు — ఇదీ పార్వతీశం ఆలోచన.

"పోనీ ఆ అబ్బాయితో ఒకసారి మాట్లాడితే?" అంది మాలతమ్మ.

"ఏ అబ్బాయి?" అన్నాడు పార్వతీశం.

"అతడి పేరు చిన్నారావని గుర్తు...."

పార్వతీశానికి చిన్నారావూ గుర్తువచ్చాడు. అతడిని తనన్న మాటలూ గుర్తుకు వచ్చాయి.

"వాడా? వాడికీ మనకూ కులం కలవదు...."

"చెడిన పిల్లని కులంవాడెలా చేసుకుంటాడండీ-...."

"బాగుంది. చెడిందని దాని ముఖంమీద రాసుందా ఏం?"

"ఈ రోజు కాకపోతే కొద్ది నెలల్లో కనపడవచ్చు...."

"ఏమన్నావ్?" అన్నాడు పార్వతీశం.

కులం కుదరని పెళ్ళిచేయడానికి ఆయన ఇష్టపడలేదు. అవసరమైతే పిల్ల చేత మందులు మింగిద్దామని అన్నాడు.

ఆ రాత్రంతా సుందరి వేరే ఏడుస్తూ కూర్చోవడం గమనించి ఆయన తనలో తను నిట్టూర్చాడు.

రెండు రోజుల అనంతరం పార్వతీశం ఇంటికి పోలీసులు వచ్చారు. అందుకు కారణం నగేంద్రసింగ్. నగేంద్రసింగ్ ఉత్తమాయాశయాలతో దోపిడీలు, దొంగతనాలు కొనసాగిస్తున్నాడు. అతడు చేసిన ప్రతి దొంగతనం వివరమూ ప్రచురించే పత్రిక ఒకటివుంది. తన పేరుతో ఇతరులు దుష్కార్యాలాచరించకుండా ఉండడం కోసం అతడు తీసుకున్న నిర్ణయమిది. అతడివద్ద ప్రత్యేకమైన సీలు ఉన్నది. ఆ సీలును తనకు చిహ్నంగా ఉపయోగిస్తూ అతడా పత్రికకు ఉత్తరం వ్రాస్తాడు. ఉత్తరంలోని వివరాలు వార్తగా ప్రచురణ అవుతాయి.

పార్వతీశం ఇంట ఏ పద్ధతిలో దొంగతనం జరిగిందో పత్రికలో వార్తగా వచ్చింది. పోలీసులు ఆమాత్రంకోసం వచ్చి ప్రశ్నలువేసి వెళ్ళారు.

దీని గురించి పార్వతీశం ఎక్కువగా కలవరపడలేదు. అతడి దిగులంతా కూతురి భవిష్యత్తు గురించి. సుందరిని తీసుకువెళ్ళి సుమారు ఒకరోజంతా తన దగ్గరుంచుకున్నట్లు నగేంద్రసింగ్ పత్రికకు వ్రాశాడు. ఆ వార్తకిప్పుడు బహుళ ప్రచారం లభించింది.

"మీరు కులం గిలం అంటూ కూర్చోకండి-ఆ చిన్నారావు సంబంధం సిరపర్చి దీనిపెళ్ళి చేయండి—" అని మాలతమ్మ గోల పెట్టింది.

పార్వతీశం కూడా కొంత దిగివచ్చాడు. అయితే చిన్నారావుని కలుసుకుని మాట్లాడడానికాయనకు మొహమాటంగా ఉంది.

మాలతమ్మ ఈ విషయం కూతురితో చెప్పి—"అతడంటే మోజుపడ్డావుకదా-పోనీ అతడినే పెళ్ళాడవచ్చు. నీకు అతగాడితో మాట్లాడే ధైర్యముందా?" అడిగింది.

ప్రయత్నిస్తాను—అంది సుందరి. ఇదంతా దేవుడిచ్చిన వరంలాగున్నదామెకు.

5

"మన సమస్యకు గజేంద్రసింగ్ ద్వారా చక్కని పరిష్కారం దొరికింది. నాన్నగారు కట్నమివ్వాలనుకున్నారు. నేను నువ్వు కావాలనుకున్నాను. డబ్బు గజేంద్రసింగ్ పట్టుకుపోయాడు. నాకు నువ్వు దొరుకుతున్నావు. మన పెళ్ళికి చచ్చినట్లు పెద్దలొప్పుకుంటున్నారు—" అంది సుందరి.

"నిజంగానా?" అన్నాడు చిన్నారావు సంతోషంగా.

"ఊఁ" అంది సుందరి.

"ఇంత త్వరగా ఒప్పుకోవడం నాకు చాలా ఆశ్చర్యంగా వుంది—" అన్నాడు చిన్నారావు.

"అందుకు నేనో ట్రిక్కు చేశాను—" అంది సుందరి.

"ఏమిటది?"

"గజేంద్రసింగ్ నా శీలం దోచాడని చెప్పాను. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని మా వాళ్ళు హడలిపోతున్నారు. వీలైనంత తొందరగా నా పెళ్ళి జరిపించేయాలని తాపత్రయపడుతున్నారు—" అంది సుందరి హాయిగా నవ్వుతూ.

ఉన్నట్టుండి చిన్నారావు ముఖం అదోలాగై పోయింది.

"అవునూ — నిన్ను వాడు కూడా తీసుకెళ్ళి ఓ రోజంతా ఉంచుకున్నాడు కదూ—" అన్నాడు చిన్నారావు సాలోచనగా.

"అవును — అదే మనకుపయోగపడింది—" అంది సుందరి.

"వాడు నిన్నెలా చూశాడు?" అన్నాడు చిన్నా

రావు.

"ఏం?" అంది సుందరి అనుమానంగా.

"ఏకాంతంలో ఉంటే నాకే నిన్నేదో చేయాలని పిస్తుంది. వాడి ప్రవర్తన గురించి—ముఖ్యంగా ఆడవాళ్ళ విషయంలో— నేను చాలా చెడ్డగా విన్నాను. అందుకని అడుగుతున్నాను—" అన్నాడు చిన్నారావు.

"యాభై వేలు పట్టుకుపోయాడని అనుకోవాలిగానీ లేని పక్షంలో ఆ గజేంద్రసింగ్ చాలా మర్యాదస్థుడని చెప్పుకోవాలి—" అంది సుందరి. అలా అంటున్నప్పుడామె కనులలో అమాయకత ప్రతిఫలించింది.

చిన్నారావు తమాషాగా నవ్వి-"నువ్వెన్ని అబద్ధాలు చెప్పినా నమ్ముతాను. కానీ గజేంద్రసింగ్ లాంటి దొంగను పట్టుకుని మర్యాదస్థుడంటే మాత్రం భరించలేను. వాడి గురించి నేను చాలా చాలా విన్నాను...." అన్నాడు.

"అయితే ఏమంటావ్?" అంది సుందరి.

"గజేంద్రసింగ్ నా ఆశలు భగ్నంచేశాడు. ఇంక నేను నిన్ను మరిచిపోక తప్పదు—" అన్నాడు చిన్నారావు.

"ఏమన్నావ్?" అంది సుందరి కోపంగా.

"నువ్వేమీ అనుకోనంటే ఒక చిన్నమాట అడుగుతాను—"

"అడుగు—" అంది సుందరి.

"గజేంద్రసింగ్ తో ఒకరోజంతా నువ్వు ఏకాంతంగా ఉన్నావంటే—నీ పవిత్రత కాపాడబడ్డం కష్టమని నా అనుమానం. అయినా నేను నిన్ను నమ్ముతాను. ఒక రాత్రి మనమిద్దరం ఏకాంతంగా ఉండే అవకాశం కల్పించు. అప్పుడు నా ప్రవర్తన ఎలా వుంటుందో, నీ

రెస్పాన్సు ఎలా వుంటుందో పరీక్షించుకుందాం. నన్ను నేను నిగ్రహించుకోలేకపోతే ఆ గజేంద్రసింగ్ ఎలాగూ నిగ్రహించుకోలేడని అనుకోవచ్చు. అప్పుడు బహుశా నేను నిన్ను బలవంతం చెయ్యవచ్చు. నన్ను కూడా నువ్వు ప్రతిఘటించలేని పక్షంలో ఆ గజేంద్రసింగ్‌ను ఎలాగూ ప్రతిఘటించలేకపోయావని అర్థమవుతుంది—" అన్నాడు చిన్నారావు.

"నన్ను ప్రేమిస్తున్నానంటూ నా చుట్టూ తిరిగిన నువ్వు ఈ రోజు నన్ను పరీక్షించాలనుకునే స్థితికి వచ్చావా?" అంది సుందరి నిట్టూర్చుతూ.

చిన్నారావు నిర్మొహమాటంగా చెప్పాడు.

"నువ్వేమైనా అను. పడతాను. మన ఏకాంతానికి ఏర్పాట్లు చెయ్యి—ప్లీజ్!" అన్నాడు.

"ఛీ—నీలాంటివాణ్ని ప్రేమించాననుకోవడంకంటె-కట్నానికి అమ్ముడుపోవడమే మంచిది—" అంది సుందరి.

"గజదొంగలో ఓ రోజంతా గడిపావు. నాతో ఏకాంతానికి బెదురుతావేం?" అన్నాడు చిన్నారావు కోపంగా.

అప్పటికి అర్థమయింది సుందరికి.

చిన్నారావు తన శీలంపాడయిందనే నమ్ముతున్నాడు. ఎలాగూ తమ వివాహం జరుగదు. ఒక్క అవకాశం ఆమె ఇవ్వరాదా అని ఆలోచిస్తున్నాడు.

"ఆ గజదొంగకున్న సంస్కారం నీకున్నదనిపించడం లేదు. వాడు నన్ను ఆడదానిలా కాక అతిథిలా చూశాడు. ఓ ఆడది సాటి ఆడదాన్ని ఆదరించినట్లు ఆదరించాడు. కానీ నువ్వలా కాదు. ప్రేమ పేరుతో నిన్ను నువ్వు వంచించుకోవడమే కాక నన్ను కూడా వంచించాలను

కుంటున్నావు. నీ వం టి వా డి తో ఏకాంతం చాలా ప్రమాదం—" అంది సుందరి.

"ఇంకా నీకు ప్రమాదముందా?" అన్నాడు చిన్నారావు.

"అసలు ప్రమాదం నీలోనే ఉంది—" అంది సుందరి—"నీతో ఏకాంతం వస్తే—నేనో నువ్వో చావక తప్పదు—"

6

సుందరి అదృష్టవంతురాలని మరోసారి ఋజువయింది. గజేంద్రసింగ్ కు సంబంధించిన వార్తను సత్తిబాబు చదివాడు. అందులోని వాక్యం అతడిని కదిలించింది.

"ఓ యువకుడి దోపిడీకీ, ఓ కుటుంబం విలాసానికీ ఉపయోగపడనున్న ఈ యాభై వేలూ నేను అభాగ్య జీవులకోసం ఉపయోగిస్తాను" అన్నాడు గజేంద్రసింగ్.

నిజమే — ఒక్క పెళ్ళి పేరు చెప్పి యాభై వేల రూపాయల ఖర్చు ఎందుకు? ఆర్భాటంగా పెళ్ళి జరిపితే అందువల్ల బాగుపడేది ఎవరు?

తన గురించి పార్వతీశం అంత డబ్బు కూడబెట్టాడు. ఆ డబ్బు యెలాగూ ఆయనకు నిలిచేదికాదు. తనిప్పుడాయన కూతుర్ని పెళ్ళిచేసుకుంటే ఆ డబ్బుపోయిన దుఃఖంనుంచి ఆయన తేరుకోగలుగుతాడు.

తొలిచూపుల్లోనే సత్తిబాబుకు సుందరి నచ్చింది. తండ్రి కట్నమడిగితే — పార్వతీశం ఇస్తానంటే అతడు సరేనని ఊరుకున్నాడు. కానీ ఇప్పుడా కట్నం కారణంగా ఈ పెళ్ళి ఆగిపోవడం అతడికిష్టంలేదు.

గజేంద్రసింగ్ తనని దోపిడీ దొంగతో పోల్చాడు. ఆ పోలిక సుందరిలో నాటుకుని ఉంటుంది. ఆమె తన

గురించి అలా అనుకునేందుకు వీల్లేదు.

కట్నాల పేరుతో ఆడపిల్లల తలిదండ్రుల్ని దోపిడీ చేసే గజదొంగల జాబితాలోకి తనూ చేరకూడదని సత్తిబాబుకు అనిపించింది. ఈ అభిప్రాయాన్నతడు తండ్రికి తెలియబర్చాడు.

సత్తిబాబు తండ్రి కలవరపడ్డాడు.

“మగపిల్లవాడికి తండ్రి ఆస్తిలో వాటా వస్తుంది. ఆడపిల్లకు రాదు. అందుకని కట్నం అన్న ఆచారం వచ్చింది-” అంటూ తండ్రి అతడికి నచ్చజెప్పబోయాడు.

“కొందరు తండ్రులు పిల్లలకు బాధ్యతలే తప్ప ఆస్తుల నివ్వరు. అలాంటప్పుడు ఆడపిల్ల వివాహమైనాక కూడా తండ్రి బాధ్యత తీసుకోగల్గుతోందా?” అంటూ ఎదురు ప్రశ్న వేశాడు సత్తిబాబు.

సత్తిబాబు తండ్రికి ముగ్గురు మగపిల్లలు. ఆయన పిల్లలకు చదువు చెప్పించాడు తప్పితే ఆస్తి ఏమీ మిగల్చలేదు. అంతా ఉద్యోగాలు చేస్తున్నారు. ఆడపిల్లలుద్యోగాలుండి కూడా కట్నం బారినుండి తప్పించుకోలేకపోయారు. ఉద్యోగం చేస్తూ కూడా తండ్రి నెప్పుడూ ఆదుకోనూ లేదు. వాళ్ళు ఆదుకోవాలని ఆయన అనుకోనూ లేదు. పైగా ఆడపిల్ల సొమ్ము ఆశించకూడదని శాస్త్రం చెప్పేవాడు.

సత్తిబాబు మాటలకు తండ్రి ఏమీ మాట్లాడలేక పోయాడు. పార్వతీశంవల్ల మగపిల్లలకు సంక్రమించే ఆస్తి ఏమీ లేదు.

సత్తిబాబులో తండ్రిని ఒప్పించగల బలం ప్రవేశించింది.

ఫలితంగా సుందరికీ అతడికీ చాలా సింపుల్‌గా

వివాహం జరిగిపోయింది. బంధువుల్ని పిలవడానిక్కూడా సత్తిబాబు అంగీకరించలేదు.

సత్తిబాబు ఈ వివాహానికి అంగీకరించిన రోజున సుందరి ప్రత్యేకంగా చిన్నారావును కలుసుకుని చెడామడా తిట్టింది. కసితీరా మాటలంది.

"మా నాన్న చెప్పినవన్నీ నిజం. నీవంటివాడి ప్రేమ కబుర్లు నమ్మరాదు. మా సంప్రదాయం కాపాడబడింది. కుటుంబ గౌరవం నిలబడింది. ఆయన కోరిక తీరింది. నీలాంటి దుర్మార్గుడి బెడదకూడా వదిలింది. ఒక ఇంజనీరు భార్యననిపించుకోగల్గుతున్నాను. నా అదృష్టం గొప్పది" అన్నదామె.

7

వివాహమైన తొలిరాత్రి సుందరి భర్తను పొగడ్డంలో గడిపింది. ఆమె పొగడ్తలకు అతడు ఎంతగానో సంతోషించాడు.

మగాడికి ఓ నిజం తెలియదు. ఒక ఆడదాని పొగడ్తలతడికిచ్చే తృప్తిని ఈ ప్రపంచంలో మరేదీ ఇవ్వలేదు. ఆడది మగాణ్ని పొగడాలంటే అదేం పెద్ద కష్టంకాదు. ఆమె చాలా అల్ప సంతోషి. ఆమె కోరుకునేది కేవలం అభిమానం.

"మీ నాన్నగారు పాతికవేలు కట్నం అడిగారు. లాంఛనాలన్నారు. బంగారమన్నారు. అన్నీ కాదని మీరు నన్ను చేసుకున్నారు. మీలో ఇంత మార్పెందుకొచ్చింది?" అని ఆశ్చర్యంగా అడిగిందామె భర్తను.

"నీకోసం. అంతే!" అన్నాడు సత్తిబాబు.

తమ భావి జీవితం గురించి వాళ్ళిద్దరూ ఎన్నో పథకాలు వేసుకున్నారు. అంతా రంగుల కలలాగే వారికి

తో వున్నది.

"అల్లుడు ఏదో రోజున నానుంచి ఆ పాతిక వేలూ పొందితీరుతాడు. ఇది నా జీవితాశయం—" అన్నాడు పార్వతీశం. ఆ మాటలు భర్తకు చెప్పింది సుందరి.

"నాకాయన డబ్బుమీద ఆశలేదు. నా ఆశలన్నీ నీమీదే! నీతో జీవితంమీదే!" అన్నాడు సత్తిబాబు. సుందరి చాలా సంతోషించింది.

అయితే ముందున్న ప్రమాదం గురించి ఆమెకు ఏమాత్రమూ తెలియదు.

8

సరిగ్గా సత్తిబాబు ఆఫీసుకు వెళ్ళిన గంటకు ఎవరో ఇంటి తలుపు తట్టారని తీసింది సుందరి. ఎదురుగా చిన్నారావుని చూసి దిమ్మెరపోయింది.

"నీ ముఖం చూస్తూనే తెలుస్తోంది. మీ కాపురం పచ్చగా ఉన్నదని...." అన్నాడు చిన్నారావు.

"ఎందుకొచ్చావ్?" అంది సుందరి అయిష్టంగా.

"నా ముఖం చూస్తే తెలియడంలా—" అన్నాడు చిన్నారావు.

ఆమె అతడిని లోపలకు రానిచ్చింది.

"న్యాయానికి మనిద్దరకూ పెళ్ళికావలసింది. నీ గురించిన నిజం తెలిసి నేను పెళ్ళిచేసుకోలేదు. తెలియక సత్తిబాబు చేసుకున్నాడు. కానీ నాకు నీమీద భ్రమ పోలేదు. ఒక్కసారి నీతో గడిపిపోదామని వచ్చాను..."

"యూ....—" అంది సుందరి.

"అలా కోపగించుకోకు. గజేంద్రసింగ్ నిన్ను రేప్ చేసిన విషయం నాకు తెలుసు. అది నీ భర్తకు చెప్పకుండా ఉండాలంటే అందుకు నీ శరీరం లంచంగా

ఇవ్వాలి—"

"అదంతా నీ భ్రమ. గజేంద్రసింగ్‌కూ నాకూ ఏ విధమైన సంబంధంలేదు...." అంది సుందరి.

"అలాగే అనుకో. కానీ నేను చెప్పవలసింది నీ భర్తకు చెబుతాను. నిజానిజాలు అతడు నీ తలిదండ్రుల నించే తెలుసుకుంటాడు—...."

సుందరి ఉలిక్కిపడింది. దుర్మార్గుడైన ఈ చిన్నారావును మంచివాడనుకుని భ్రమపడి — అతడిని పెళ్ళి చేసుకోవాలనుకుని — అతడికోసం యింట్లో దారుణమైన అబద్ధం చెప్పింది. ఆ అబద్ధాన్ని తలిదండ్రులు నమ్మారు. చిన్నారావు అసలు రంగును బయటపెట్టింది. తన తలిదండ్రులు కోర్టు పక్షులు కారు. సత్తిబాబు నిలదీస్తే వారు నిజాన్ని దాచలేరు. అయితే వారనుకునే నిజం నిజం కాదు.

"ఆలోచిస్తున్నావా?" అన్నాడు చిన్నారావు.

"నిన్ను గెటౌట్ అనడానికి మాత్రం ఏ ఆలోచనా అక్కర్లేదు—...." అంది సుందరి తీవ్రంగా.

"నేను ఆశావాదిని. అప్పుడే నీ విషయంలో తొందర పడదల్చుకోలేదు. నీకు రెండ్రోజులు టయిమిస్తున్నాను. పెళ్ళికి ముందే శీలం చెడినదానివి. పతివ్రతలా కబుర్లు చెప్పకు—...." అని వెళ్ళిపోయాడు చిన్నారావు.

సుందరి ఆలోచనలోపడింది. ఆమె మనసునిండా దిగులు చోటుచేసుకుంది. ఇలా జరుగుతుందని ఆమె అనుకోలేదు.

సత్తిబాబుపైన ద్వేషంతో తను చిన్నారావును ప్రేమించనారంభించింది. ఇప్పుడు సత్తిబాబును ప్రేమి

న్తూంటే చిన్నారావు ప్రతిబంధకమయ్యాడు.

చిన్నారావులో దృఢ నిశ్చయం కనబడుతోంది.

అతడికి లొంగిపోతే.

ఊహే వెగటుగా తోచిందామెకు. యెవరైనా చిన్నారావును చంపేయగలిగితే బాగుంటుంది. తనే ఆ పనిచేస్తే!

ఇంటికి వచ్చినపుడు ఏ పాలలోనో ఇంత విషం కలిపి యిస్తే....

సుందరికి చిన్నారావును చంపాలనే ఉంది కానీ పట్టుబడిపోతానన్న భయం ఆమెను బెదిరిస్తోంది.

ఆ సాయంత్రం సత్తిబాబు ఓ విశేషంతో వచ్చాడు. అది సుందరినింకా భయపెట్టింది.

గజేంద్రసింగ్ ఓ యువతిని దారుణంగా బలవంతం చేసి చంపాడట. వార్తాపత్రికలో మొదటి పేజీలో వేశారీ వార్తను.

అది చదివి వణికిపోయిందిసుందరి. గజేంద్రసింగ్ కు స్త్రీ వాంఛ అధికమనీ దొరికిన ఆడదాన్ని వదిలిపెట్టడనీ క్రూరంగా హింసించి మరీ వదులాడనీ—అతడి గురించి చాలా దారుణంగా రాశారంతులో.

సత్తిబాబు ఆమెకా వార్త చెప్పలేదు. అతడాఫీసు నుంచి వచ్చేటప్పుడు వార్తాపత్రిక కొని తీసుకువస్తాడు. అలాగే ఈ రోజూ తెచ్చాడు. వార్తలనామెతో చర్చించే అలవాటు అతడికి లేదు. ఇంకా పెళ్ళయిన కొత్త. సత్తిబాబుకు పెళ్ళాంతో సరదాగా గడిపే దెలాగో తెలుసు.

తనకుతానై ఆ వార్త గురించి చర్చించే ఉద్దేశ్యం

సుందరికి లేదు. భర్త నా వార్త అంతగా ఆకర్షించక పోవడం కొంతలో కొంత మేలనుకుంది.

9

రెండ్రోజుల తర్వాత మళ్ళీ చిన్నారావామెను కలుసుకున్నాడు.

"చూశావుగా నీ గజేంద్రసింగ్ చరిత్ర! ఏ కారణం వల్లనో నీ భర్తను అసలు విషయం ఆకర్షించలేదు. ఒక్కసారి అతడిలో అనుమాన పిశాచి ప్రవేశించిందంటే నీకింక జీవితాంతం నరకమే!" అన్నాడతడు.

"నన్ను వదిలిపెట్టు. నీకోసం ఇంకేమైనా అడుగు-" అంది సుందరి. ఇప్పుడామె గొంతులో ధైర్యంలేదు.

"నాకింకేమీ వద్దు. నువ్వే కావాలి—" అన్నాడు చిన్నారావు.

గెటౌట్, షటప్ లాంటి పదాలుపయోగించలేక పోయిందామె. నిస్సహాయంగా అతడివంక చూస్తూ—"జీవితాంతం నన్నిలా వేధిస్తావా?" అనడిగింది.

"జీవితాంతం వేధించను. ఒక్కసారి....ఒక్కసారి చాలు...." అన్నాడు చిన్నారావు.

అతడి మాటలు వింటూంటే అసహ్యం వేసిందామెకు. అయినా ఆ అసహ్యాన్నణచుకుని — "ఇప్పడలాగే అంటావు...." అంది.

"నువ్వే చూస్తావుగా—" అంటూ అతడామెను సమీపించాడు.

"ఇప్పుడు వద్దు. మళ్ళీ రెండ్రోజులాగిరా" అందామె.

"ఎందుకని?"

"నా మనసేమీ బాగాలేదు. ముందు నేను మానసికంగా అందుకు సిద్ధపడాలికదా!" అన్నది సుందరి.

"నువ్వు మానసికంగా అందుకు సిద్ధపడుతున్నట్లు నాకు సాక్ష్యం కావాలిగదా!" అన్నాడు చిన్నారావు.

"అంటే?"

చిన్నారావు చటుక్కున ఆమెను దగ్గరగా లాక్కుని పెదాలను చుంబించి—"ఒక్కసారిగా మారడం నీకూ కష్టం. మన మధ్య ప్రారంభం కానున్న ప్రేమకాండకీ రోజు శంకుస్థాపన జరుగుతోంది-" అని వెళ్ళిపోయాడు.

ఒకరకమైన అసహ్యభావంతో సుందరి ఒళ్ళు కంపించింది. అతడిని తను వారించలేకపోతోంది.

నిజానికి తను ఏ తప్పూ చేయలేదు. వివాహానికిముందు తన శరీరం మలినం కాలేదు. కానీ ఆ విషయం భర్త నమ్మాదేమోనని తను భయపడుతోంది. ఆ కారణంగా తనిప్పుడు నిజంగా తన శరీరాన్ని మలినం చేసుకుంటోంది.

విషయమంతా భర్తకు చెబితే....?

సుందరికి ఏ మాత్రమూ ధైర్యం చాలలేదు.

అయితే ఆ సాయంత్రం భర్త తీసుకువచ్చిన వార్తా పత్రికలో గజేంద్రసింగ్ కు సంబంధించిన మరో వార్త ఉన్నది. ఆ వార్తలో ఆశ్చర్యానందాద్భుత రసాలు నిండివున్నాయి.

గజేంద్రసింగ్ నేరాలు చేస్తాడు. తనుచేసే ప్రతి నేరాన్నీ పత్రికలకు తెలియబరుస్తాడు. అతడు స్త్రీని గౌరవిస్తాడు. స్త్రీపై అత్యాచారాన్ని సహించడు. తను అత్యాచారం చేయడు సరిగదా ఎవరైనా స్త్రీపై అత్యాచారంచేస్తే వారిని క్రూరంగా శిక్షిస్తాడు. కొద్ది రోజులక్రితం తన పేరుతో ఒక అబలపైన జరిగిన అత్యాచారం అతణ్ని ఆగ్రహోదగ్రుణ్ని చేసింది. అతడా వ్యక్తిని వేటాడి, చంపి సాక్ష్యాధారాల యింట వదిలి

పోలీసులకు తరం వ్రాశాడు. తన పేరును అత్యాచారాల కుపయోగించుకునే వారికా శవం హెచ్చరిక అని కూడా చెప్పాడు.

ఈ వివరాలన్నీ చదివి సుందరి ఆనందంతో గాలిలో తేలిపోయింది.

చటుక్కున ఆమె భర్త వద్దకు తీసుకువెళ్ళి ఆ వార్త చూపించింది.

అతడది చూసి—"ఈ వార్త లేకున్నా గజేంద్రసింగ్ సచ్ఛీలతను నేను నమ్ముతాను—...." అన్నాడు.

అప్పుడు సుందరికి కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు.

"గజేంద్రసింగ్ మీకు తెలుసా?" అన్నదామె.

"ఊఁ."

"అతడితో మీకెలా పరిచయమైంది—...." అంది సుందరి కుతూహలంగా.

"అతడు కాదు....ఆమె...." అన్నాడు సత్తిబాబు.

"అంటే?"

"దయచేసి ఈ విషయం రహస్యంగా ఉంచు...." అన్నాడు సత్తిబాబు.

ఆమె పేరు చాముండేశ్వరి. వాళ్ళది సత్తిబాబు పక్క ఇల్లు. ఆమె తండ్రి నిజాయితీకి మారుపేరుగా ఉండే ఓ ప్రభుత్వోద్యోగి. ఆ కారణంగా ఆయన అష్ట కష్టాలుపడడంకాక—అన్యాయంగా జైలుకు వెళ్ళాడు. ఆ షాక్‌కు చాముండేశ్వరి తల్లి పోయింది. జైల్లోనే తండ్రి మరణించాడు. కాలేజీలో చాముండేశ్వరికి మంచి పేరు ఉండేది. ఆమె చెయ్యెత్తు మనిషి....అన్నీ విప్లవాత్మక భావాలు. సత్తిబాబు ఆమె ఆలోచనలను సమర్థిస్తూండే

వాడు.

జీవితంలో తనకెవ్వరూ లేకుండా పోయాక ఆమె గజేంద్రసింగ్‌గా మారింది. ఆరంభంలో ఆమెకు సత్తిబాబు సహాకరించాడు. ఆ తర్వాత ఆమె ఏమయిందో ఆతడికి తెలియదు.

"ఆమె తీవ్రంగా నిరసించే వాటిలో వరకట్నమొకటి. ఆమె వాగ్గాటినీ అభిప్రాయాలనూ చాలా సార్లు మెచ్చుకున్నాను నేను. మీ ఇంట్లో దొంగతనం జరిగిందనగానే—నా స్నేహితురాలు నాకు బుద్ధి చెప్పినట్లనిపించింది. అందుకే నిన్ను కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాను—...." అన్నాడు సత్తిబాబు.

సుందరి ఆలోచనలు వెనక్కి పరుగెడుతూన్నాయి. గజేంద్రసింగ్‌లో స్త్రీని వెతుకుతుందామె. ఆలోచిస్తూంటే గాంభీర్యంలేని ఆ మాట-నునుపైన ఆ చెక్కిళ్ళు ఆ నడక అన్నిట్లోనూ ఆడతనం గోచరిస్తోంది.

ఇప్పుడు చిన్నారావేం చేస్తాడు? మళ్ళీ తన దగ్గరకు వచ్చి ఇంకో రకంగా బెదిరిస్తాడా?

10

రెండ్రోజుల అనంతరం చిన్నారావామె వద్దకు వచ్చాడు. సుందరి అతడిని లోపలకు ఆహ్వానించి కుర్చీలో కూర్చోపెట్టి—"నిన్నెందుకు ఆహ్వానించానో తెలుసా?" అంది.

అతడు తల అడ్డంగా ఊపాడు.

"గుమ్మంలోంచే పొమ్మనాలంటే జస్ట్ గెటౌట్ అనాలి. లోపల అయితే నిన్ను ఇంకా ఇంకా నా ఇష్టంవచ్చిన మాటలన్నీ అని తిట్టొచ్చు—...." అంది

సుందరి.

చిన్నారావు కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

"మరి—నీకు నేనెందుకు వచ్చానో తెలుసా?" అన్నాడతడు.

సుందరి చిరాగ్గా—"తెలుసు—" అంది.

"నీకు తెలియదు...." అన్నాడు చిన్నారావు. అతడు చటుక్కున వంగుని ఆమెకు పాదాభివందనం చేసి- "జరిగిందంతా మర్చిపో. ఈ క్షణంనుంచీ నువ్వు నాకు తల్లితో సమానం—" అన్నాడు.

సుందరి ఆశ్చర్యపడిపోయింది.

"ఒక గజ దొంగ—సమాజ విద్రోహిగా పరిగణించబడిన వ్యక్తి—తనమీద అత్యాచార నేరం మోపబడితే సహించలేకపోయాడు. ఆ నేరం మోపిన వ్యక్తిని క్రూరంగా శిక్షించాడు. తను నిర్దోషినని నిరూపించుకున్నాడు. అలాంటిది సమాజంలో మంచివాడుగా పరిగణించబడాలనుకుంటున్న నేను నీ మీద అత్యాచారం తలపెడితే—అప్పుడు సమాజంలో నా స్థానం ఏమిటి? గజదొంగకంటె హీనమవుతాను. గజేంద్రసింగ్ నా కళ్ళు తెరిపించాడు. స్త్రీ పట్ల నా బుద్ధిని మార్చాడు...." అన్నాడు చిన్నారావు.

సుందరి అతడి వంక తెల్లబోయి చూస్తోంది.

"నువ్వు దేవతవు. నేను నీకు తగనివాడిని. అందుకే భగవంతుడు నాలో ఆ అనుమానాన్ని సృష్టించాడు. నాకు తగిన శాస్తి జరిగింది...." అన్నాడు చిన్నారావు.

సుందరి ఏమీ మాట్లాడలేదు.

చిన్నారావు వెళ్ళిపోయాడు.

40

సుందరి సత్తిబాబు గురించి ఆలోచిస్తోంది. గజేంద్ర గత చరిత్ర తెలిసి ఉండకపోతే సత్తిబాబు తనను పెళ్ళి చేసుకుని ఉండేవాడా?

ఈ ప్రశ్నకామెకు సరైన జవాబు దొరకలేదు.

గజేంద్రసింగ్‌ను పోలీసులెందుకు పట్టుకోలేకపోతున్నారో మాత్రం ఆమెకు స్ఫురించినట్టుంది.

—:అయిపోయింది:—